క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన ప్రవీణ్‌కుమార్



ఎల్కతుర్తి : ఎస్సైగా అక్కెనపల్లి ప్రవీణ్‌కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు పూలబొకే అందజేసి స్వాగతం పలికారు. ఇక్కడ పనిచేసిన గోదారి రాజ్‌కుమార్ పలు ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్ అయిన విషయం తెలిసిందే. కాగా ఆయన స్థానంలో ప్రవీణ్‌కుమార్ బాధ్యతలు చెపట్టారు.

22 నుంచి గ్రామసభలు

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో భాగంగా ఎల్కతుర్తి మండలంలోని వివిధ గ్రామాల్లో ఈనెల 22వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే గ్రామసభలను వినియోగించుకోవాలని ఎంపీడీఓ విజయ్‌కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో కోరారు. 22వ తేదీన ఆరేపల్లి, చింతలపల్లి, గుంటూర్‌పల్లి, ఇంధిరానగర్, శాంతినగర్, సూరారం, వీరనారాయణపూర్, కోతులనడుమ, పెంచికలపేట, 23న జీల్గుల, జగన్నాథ్‌పూర్, కేశవాపూర్, రామకృష్ణాపూర్, తిమ్మాపూర్, గోపాల్‌పూర్, దండేపల్లి, 24న బావుపేట, దామెర, ఎల్కతుర్తి, వల్బాపూర్ గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.

జయప్రదం చేయాలి

ఆత్మకూరు : ఈనెల 25వ తేదీన హసన్‌పర్తిలో నిర్వహించనున్న భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సును విజయవంతం చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అక్కంపేటలో సదస్సుకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సదస్సుకు అధిక సంఖ్యలో తరలిరావాలన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు భిక్షపతి, రాజు, ప్రసంగి, నరేష్, వినోద, రాధ, పాల్గొన్నారు.

21పీఆర్‌కేఎల్ 102 : కరపత్రాలు ఆవిష్కరిస్తున్న డీబీఎఫ్ నాయకులు

బాధిత కుటుంబానికి పరామర్శ

ఐనవోలు : మండలంలోని నందనం గ్రామానికి చెందిన పిట్టల లచ్చమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న టిస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు మంగళవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

సైబర్ మోసాలపై అవగాహన సదస్సు

ఎంజీఎం : సైబర్ మోసాలపై జిల్లా వైదరోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం వైద్యులకు, వైద్యసిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. ఐసీఐసీఐ ఫౌండేషన్ రిసోర్స్ పర్సన్ రాజేంద్రప్రసాద్ సైబర్ నేరాలను వివరించారు. వాటికి గురికాకుండా ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై స్పష్టంగా వివరించారు.

దేశభక్తి గీతాలపై శిక్షణ

విద్యారణ్యపురి: భారత గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు దేశభక్తి గీతాలు పాడేందుకు శిక్షణను ఈనెల 23, 24 తేదీల్లో హనుమకొండ ప్రభుత్వ డైట్‌లో ఇవ్వనున్నామని వల్లంపట్ల ఆర్ట్ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రధాన కార్యదర్శి మ్యాకల సూరయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్యాలు తమ తమ పాఠశాలల నుంచి విద్యార్థులను ఈ శిక్షణకు పంపాలని కోరారు. ఆసక్తిగల వారు 94401 07543, 97057 58185 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

హ్యాక్‌థాన్‌లో కిట్స్ విజేత

హసన్‌పర్తి : ప్రతిష్టాత్మకమైన అంతర్జాతీయ హైపర్ మోడ్ నాలెడ్జ్ గ్రాఫ్+ఏఐ చాలెంజ్ ఇంటర్నేషల్ హ్యాక్‌థాన్ గ్రాడ్‌లో కిట్స్ విద్యార్థులు విజేతగా నిలిచారు. విద్యార్థులు యశ్వంత్ కృష్ణ, ఈషా బెల్లాడిలు (మూడు వేల యూఎస్ డాలర్లు) ప్రథమ బహుమతి సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి తెలిపారు. హ్యాక్‌థాన్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రొఫెసర్ వేణుమాధవ్, ప్రొఫెసర్ శంకర్, డాక్టర్ రాజనరేందర్ రెడ్డి, ప్రభాకరాచారిలు పాల్గొన్నారు.

డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ



విద్యారణ్యపురి: తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సరం డైరీని, క్యాలెండర్‌ను హనుమకొండలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మంగళవారం ఆవిష్కరించారు. సంఘం వరంగల్ జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎస్.రవీందర్, ఎల్ సుధాకర్‌రావు, బాధ్యులు మహేష్‌నాయక్, హెచ్‌ఎంలు ఎం.పట్టాభి, వి సదానందం, బి పరమేశ్వర్, ప్రద్యుమ్న, కృష్ణమూర్తి, దితరులు పాల్గొన్నారు.

హైవే నిర్వహణ అధ్వానం



ఆత్మకూరు శివారులో రోడ్డుకిరువైపులా పెరిగిన ముళ్లపొదలు



ముళ్లపొదలతో కనిపంచని సూచికబోర్డులు

- రోడ్డుకిరువైపులా ముళ్లపొదలు, తుమ్మచెట్లు
- తొలగించాలని వాహనదారుల డిమాండ్
- దృష్టిసారించని అధికారులు

ఆత్మకూరు : మండల కేంద్రం పరిధిలో జాతీయ హదారికిరువైపులా ముళ్ల పొదలు, తుమ్మచెట్లు గుబురుగా పెరగడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. పాదచారులు నడిచేందుకు ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఉదయం వాకింగ్‌కు వెళ్లేందుకు వాకర్స్ జంకుతున్నారు. ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో సూచికబోర్డులు కూడా కనిపించడం లేదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని తెలిపారు. జాతీయ రహదారి నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. అలాగే జాతీయరహదారిపై యూటర్న్‌ల ఏర్పాటులో శాస్త్రీయత లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయని భయాందోళన చెందుతున్నారు. మండల కేంద్రంలో యూటర్న్‌ల వద్ద చెట్లు పెరగడంతో వాహనాలు మళ్లించేందుకు తంటాలు పడాల్సివస్తుందని వాపోతున్నారు. ఈ రహదారి గుండా నిత్యం వందలాది లారీలు వెళ్తుండడంతో పలుచోట్ల రోడ్డు మెత్తబడి వాహనాలు స్కిడ్ అవుతున్నాయని, హైవే అధికారులు నిత్యం రోడ్డును పరిశీలించి కాంట్రాక్టర్‌తో మరమ్మతులు చేయించాలని ప్రయాణికులు, స్థానికులు ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



శాయంపేట : మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు

- గ్రామసభల్లో ఎమ్మెల్యేలు గండ్ర, కేఆర్
- ఆందోళన పడొద్దని సూచన
- పలు గ్రామసభల్లో రసాభాస

శాయంపేట : ఈనెల 26వ తేదీన రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించనున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందుతాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండలంలోని సూర్యనాయక్‌తండా, నేరుడుపల్లి, అప్పయ్యపల్లి, తహరాపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలను నిర్వహించగా తహరాపూర్‌లో పంచాయతీ కార్యదర్శి అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈనెల 26 నుంచి అమలు చేయబోతున్న నాలుగు సంక్షేమ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను ప్రజా ప్రభుత్వంలో అర్హులైన లబ్ధిదారులకు అందేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈనెల 24వరకు నిర్వహించే గ్రామసభల్లో గ్రామస్తులను, ఇందిరమ్మ కమిటీలను భాగస్వాములు చేయాలని అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గానికి 3500 ఇళ్లు మంజూరు అయ్యాయని, సరిపోకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి మరో 3500 ఇళ్లను మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. సంక్షేమ పథకాల జాబితాలో పేర్లులేని వారు గ్రామాల్లో ఏర్పాటు చేసే హెల్ప్‌డెస్క్ వద్ద దరఖాస్తు చేసుకోవాలని అన్నారు.

ఐనవోలు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్. నాగరాజు అన్నారు. మంగళవారం పున్నేలు గ్రామ సభకు హాజరై మాట్లాడారు. ఈనెల 26 నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా, నూతన రేషన్‌కార్డుల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 25వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తున్న తరుణంలో జాబితాలో పేరులేనివారు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించాలని అధికారులకు సూచించారు. దరఖాస్తుదారులకు సమస్య ఎదురైతే టోల్ ఫ్రీ నంబర్ 8096107107కి కాల్ చేయాలని అన్నారు. గత ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఒక్క రేషన్‌కార్డు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం పేదలకు అన్ని సంక్షేమ పథకాలు అందిచేందకు ముందడుగు వేసిందన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకట్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ గౌడ్, కత్తి సుధీర్‌గౌడ్, సాంబయ్య పాల్గొన్నారు.



పరకాల : మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్ అనిత, కమిషనర్ సుష్మ

ఆత్మకూరులో ఎంపీడీఓ..

ఆత్మకూరు : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని అగ్రంపహాడ్, అక్కంపేట, కామారం, హుజుబుజుర్గు గ్రామపంచాయతీల్లో ప్రజాపాలనలో భాగంగా మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలను గ్రామ పంచాయతీలో ప్రదర్శించారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాలో పేర్లువారి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. తమ పేర్లు జాబితాలో లేవని పలువురు అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేందర్, మండల ప్రత్యేక అధికారి మహేందర్, తహసీల్దార్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీఓ విమల, ఎంఈఓ విజయ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

వేలేరులో..

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్, మద్దెలగూడెం, కన్నారం, గొల్లకిష్టంపల్లి, బండతండా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు ఎంపీడతో లక్ష్మీప్రసన్న తెలిపారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు దరఖాస్తులు చేసుకోని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. గ్రామసభలో అర్హుల పేర్లను చదివి వినిపించినట్లు తెలిపారు. ఆయా గ్రామ సభల్లో తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల, ఏఓ కవితా రాణి, ఎంఈఓ చంద్రమౌళితో పాటు తదితరులు పాల్గొన్నారు.

దామెరలో..

దామెర : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల అమలు కోసం అర్హులను ఎంపిక చేసేందుకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి బాలరాజు అన్నారు. ఊరుగొండ, ల్యాదెళ్ల, ముస్త్యాలపల్లి, పసరగొండ, ఒగ్లాపూర్ గ్రామాల్లో మంగళవారం గ్రామసభలు నిర్వహించారు. అధికారులు పాల్గొన్నారు.

గ్రామసభలో రసాభాస



అధికారులను నిలదీస్తున్న మహిళలు

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాల్లో భాగంగా కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకాల అమలు కోసం నిర్వహిస్తున్న గ్రామ సభల్లో రసాభాస నెలకొంది. భీమదేవరపల్లి మండలంలోని బొల్లోనిపల్లి, గాంధీనగర్, కొప్పూర్, భీమదేవరపల్లి, కొత్తకొండ, రాంనగర్, రసూల్‌పల్లిలో నిర్వహించిన గ్రామసభల్లో పథకాల డ్రాఫ్ట్ లిస్టు అధికారులు చదివి వినిపించారు. లిస్టులో పేరులేనివారు అధికారులను నిలదీశారు. అధికారులు వారికి సర్ధిచెప్పే ప్రయత్నం చేసినప్పటికీ వినిపించుకోలేదు. అర్హులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. మరోమారు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించడంతో అప్పటికప్పుడు హెల్ప్‌డెస్క్‌లో దరఖాస్తులు చేసుకునేందుకు పరుగులు తీశారు. అడిషినల్ డీఆర్డీఓ శ్రీనివాస్, ఎంపీడీఓ వీరేశంతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదరహిత డ్రైవింగ్ చేయాలి

- ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి

హన్మకొండ: ప్రాణం విలువైందని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా వాహనాలు నడిపి రోడ్లు ప్రమాదాలు నివారించాలని హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.సీతారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని వరంగల్-1 డిపోలో రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో సీఐ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఆర్టీసీ బస్సు అంటేనే సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవచ్చనే నమ్మకం ప్రజల్లో ఉందన్నారు. ఆర్టీసీ డ్రైవర్లపై ఎంతో బాధ్యత ఉందన్నారు. ప్రమాదాల్లో ఆర్టీసీ ప్రమాదం శాతం తక్కువగా ఉందన్నారు. ఆధునిక పరిజ్ఞానంతో రోడ్లు నిర్మించుకున్న, వాహన వేగం పెంచుకున్న కానీ మానవ తప్పిదాల వలన ఇట్టి ప్రమాదాలు చాలా జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా ప్రమాదాలు చేయని డ్రైవర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వరంగల్ డిప్యూటీ ఆర్‌ఎం కేశరాజు భాను కిరణ్, డిపో మేనేజర్లు వంగల మోహన్‌రావు వెల్దండి జ్యోత్స్న, సూపర్ వైజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.



డ్రైవర్‌ను సన్మానిస్తున్న ట్రాఫిక్ సీఐ సీతారెడ్డి

ప్రశాంత వాతావరణం కల్పించాలి

ఆర్టీసీ డ్రైవర్ల కుటుంబాలు వారికి ప్రశాంత వాతావరణం కల్పించాలని ఆర్టీసీ వరంగల్-1 డిపో మేనేజర్ వంగల మోహన్ రావు సూచించారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం డిపోలో ఫ్యామిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. విధులకు హాజరై వచ్చే ఆర్టీసీ డ్రైవర్లను కుటుంబ సభ్యుల విసిగించవద్దన్నారు. ప్రశాంతమైన మనసుతో డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ సంతోష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

మిషన్ ఆస్పత్రి భూములను పరిరక్షించాలి

ఖిలా వరంగల్: అక్రమణకు గురైన బాప్టిస్టు చర్చి (మిషన్‌ఆస్పత్రికి) సంబంధించిన వెలువైన భూములను పరిరక్షించాలని తెలుగు బాప్టిస్టు చర్చిల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద సురేందర్ బాబు కోరారు. మంగళవారం వరంగల్ 41వ డివిజన్ ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని తెలుగు బాప్టిస్టు చర్చి(టీబీ సీ) ప్రాంగణంలో ఆయన మాట్లాడుతూ చర్చి కి సంబంధించిన ఆస్తులను కొందరు కబ్జాదారులు ఆక్రమించారన్నారు. ఉత్తర్వుల ప్రకారం జిల్లా అధి కారులు స్పందించి ఆక్రమణదారుల చేతిలో ఉన్న భూములను స్వాధీనపర్చి మిషన్ ఆస్పత్రిని కాపాడాలని కోరారు.


ఆంగ్లభాషపై అభిరుచిని పెంచుకోవాలి

విద్యారణ్యపురి: ఆంగ్ల భాషపై విద్యార్థులు అభిరుచిని పెంచుకోవాలని వరంగల్ ఎల్‌బీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు కోరారు. మంగళవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియేషన్ (ఎల్టా) వరంగల్ ఆధ్వర్యంలో ఎల్‌బీ కళాశాలలో జిల్లాస్థాయిలో విద్యార్థులకు ఒలంపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఎల్టా రాష్ట్ర అధ్యక్షుడు టి వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

యుద్ధభేరి సభను విజయవంతం చేయాలి

కేయూ క్యాంపస్: బీసీ విద్యార్థి యువతకు నష్టంకలిగే ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ రద్దుకు బీసీ గ్రాడ్యూయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాల గ్రౌండ్‌లో జరిగే బీసీ యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కేయూలోని క్రీడా మైదానంలో , కామన్ మెస్‌లో ఆయన విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం ఆధ్వర్యంలో యుద్ధభేరి పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు అన్నిరంగాల్లో వెనకబాటుకు గురవుతున్నారన్నారు. జనాభా ప్రాతిపదికన ఉన్నత వర్గాల్లో పేదవర్గాల పిల్లలకు మాత్రమే రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ఓసీ అభ్యర్థికి 50 మార్కులు వచ్చినా కూడా ఈడబ్ల్యూఎస్ కింద ఉద్యోగం పొందుతుండగా 80 మార్కులు వచ్చినా బీసీ అభ్యర్థికి ఉద్యోగంలోనికి రాలేకపోతున్నారన్నారు. ఈడబ్ల్యూఎస్‌ను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కేయూ కామన్‌మెస్‌ను సందర్శించారు.

లెనిన్ ఆశయసాధనకు కృషి



న్యూశాయంపేట/మడికొండ: లెనిన్ ఆశయ సాధన కోసం ప్రజా ఉద్యమాలు నిర్మిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. మంగళవారం బాలసముద్రం, మడికొండలోని రావి నారాయరెడ్డి నగర్‌లో పార్టీ కార్యాలయాల్లో లెనిన్ వర్ధంతి సభ జరిగింది. జిల్లా సమితి అధ్వర్యంలో చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులర్పించారు. నాయకులు జ్యోతి, కరుణాకర్, ఎల్లేష్, భిక్షపతి, శ్రీనివాస్, రాజు, సారంగపాణి, మునిగాల భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి ఎల్లేష్, శంకర్, దీన, పద్మ, సత్యలక్ష్మి, కమల, పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- ఏసీపీ సతీశ్‌బాబు



మాట్లాడుతున్న ఏసీపీ సతీశ్‌బాబు

ఆత్మకూరు : శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు భాగస్వాములు కావాలని పరకాల ఏసీపీ సతీశ్ బాబు అన్నారు. మండలంలోని నీరుకుళ్లలో మంగళవారం రాత్రి కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీసీటీవీల ప్రాముఖ్యత, డయల్-100, రహదారి భద్రత నియామలు, సైబర్ నేరాలు, 1930 అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం వాహన తనిఖీలు చేపట్టి పత్రాలు లేని 10 వాహనాలకు రూ.3,200 జరిమానా విధించారు. కావటి లక్ష్మీనర్సు వద్ద నుంచి అక్రమ మద్యం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయగా, అక్రమ గుడుంబా రవాణా చేస్తున్న అజ్మీరా వెంకటేశ్‌పై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గుట్కాలు, అక్రమ మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. యువత సన్మార్గంలో నడవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు సంతోశ్, క్రాంతికుమార్, ఎస్సై పరమేశ్వర్ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి కాంగ్రెస్‌లో చేరికలు

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే శ్రీహరి

వేలేరు : రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసే పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పీచర గ్రామానికి చెందిన సుమారు 60 మంది బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే శ్రీహరి కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. జనవరి 26 నుంచి అమలు కానున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు అర్హులైన పేదలకు అందించే విధంగా కాంగ్రెస్ కార్యకర్తలు భాగస్వాములు కావాలని సూచించారు. అలాగే నూతనంగా ఏర్పడిన వేలేరు మండల అభివృద్ధికి సరిపడా నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేసి కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎనుమాముల మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాంగోపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ మల్లికార్జున్, మాజీ ఎంపీటీసీ సంపత్, నాయకులు ప్రమోద్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, అశోక్, సిద్దులు, శ్రీకాంత్, నాగరాజు, రవితేజ, ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రణాళికతో లక్ష్యాన్ని చేరుకోవాలి

- సీడబ్ల్యూసీ సభ్యుడు దామోదర్



మాట్లాడుతున్న కజాంపురం దామోదర్

కమలాపూర్ : విద్యార్థులు చక్కటి ప్రణాళిక, పట్టుదలతో చదివి లక్ష్యాన్ని చేరుకోవాలని సీడబ్ల్యూసీ సభ్యుడు, మోటివేషనల్ స్పీకర్ కజాంపురం దామోదర్ సూచించారు. మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, ఓరుగల్లు కన్స్యూమర్స్ ప్రొటెక్షన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలనే తపన ఉన్నప్పుడే విద్యార్థులు వ్యక్తిగతంగా, సామాజికంగా ప్రయోజకులు అవుతారన్నారు. విద్యార్థులు తమ వ్యక్తిత్వాన్ని, భవిష్యత్‌ను విచ్ఛిన్నం చేసే తప్పుడు మార్గాలవైపు వెళ్లొద్దని సూచించారు. క్రమశిక్షణ, దేశభక్తి, తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం, సామాజిక సేవా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. అనంతరం సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య మాట్లాడుతూ.. విద్యార్థులు కాలాన్ని వృధా చేయకుండా విద్యపై దృష్టి కేంద్రీకరించి ఉన్నతంగా ఎదగాలని అన్నారు. విద్యార్థులను ఉత్సాహపరుస్తూ వెంకటేశ్వర్లు పాడిన పాటలు పలువురిని ఆకట్టుకున్నాయి. సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగేందర్, కార్యవర్గ సభ్యుడు మార్క రవీందర్‌గౌడ్, లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలి



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

దామెర : విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించాలని ఎంఈఓ లకావత్ రాజేశ్‌కుమార్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్వయంపరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులుగా, ఉపాధ్యాయులుగా విద్యార్థులు వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థి దశ జీవితం అద్భుతమైందని అన్నారు. చవుతోపాటు అన్నిరంగాల్లో రాణించి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు నవీన్, రవీందర్, రమేశ్, సృజన, రుక్మిణి, శ్రీలత, మాధవి పాల్గొన్నారు.

'సోలార్ సూర్యఘర్'పై అవగాహన



మాట్లాడుతున్న వెంకటరమణ

ఎల్కతుర్తి : కేశవాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో మంగళవారం సోలార్ సూర్యఘర్ పైలట్ ప్రాజెక్టుపై విద్యుత్ వినియోగదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ వెంకటరమణ, ఏడీఈ వంశీకృష్ణ, డీఎమ్ మహేందర్ హాజరై మాట్లాడారు. హనుమకొండ జిల్లా నుంచి కేశవాపూర్ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు తెలిపారు. గృహ వినియోగదారులతో పాటు వ్యవసాయ వినియోగదారులందరికీ ఉచితంగా సోలార్ ప్యానల్స్ అందజేసి రెగ్యూలర్ మీటర్ తొలగించి నెక్టుమీటర్ అమర్చనున్నట్లు పేర్కొన్నారు. దీనికి గ్రామస్తులు సుముకంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఏఈ సుధాకర్, పాల్గొన్నారు.

గుడుంబా తరలిస్తున్న నలుగురి అరెస్ట్



శాయంపేట : గుడుంబాను తరలిస్తున్న నలుగురు మహిళలను అరెస్ట్ చేసినట్లు పరకాల ఎక్సైజ్ సీఐ తాతాజీ మంగళవారం తెలిపారు. గుడుంబా నివారణ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మండలంలోని గట్లకానిపర్తి గ్రామంలో, పరకాల మండలంలోని పోచారం , కామారెడ్డి గ్రామాల్లో దాడులు నిర్వహించగా గట్లకానిపర్తి గ్రామానికి చెందిన మోరె మధునమ్మ, ఆకునూరి మమత, బొమ్మ శారద, పరకాలకు చెందిన సాదు సరోజన గుడుంబా విక్రయిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గుడుంబా స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ దాడులలో ఎక్సైజ్ ఎస్సై సులోచన, కానిస్టేబల్స్ లక్ష్మణచారి, విజయ్‌కుమార్‌లు ఉన్నారు.